క్లుప్తంగా

భారీగా తగలబడిన చెత్త



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

రాయదుర్గంటౌన్: పట్టణంలోని డంపింగ్‌యార్డులో భారీస్థాయిలో చెత్త తగలబడింది. సోమవారం రాత్రి 9 గంటలకు ఆకస్మాతుగా చెత్తకు నిప్పంటుకున్న విషయం తెలిసిందే. గాలి వేగానికి మంటలు వ్యాపించి రాత్రంతా భారీ ఎత్తున చెత్త తగలబడింది. ప్రైవేటు ట్యాంకర్లను ఏర్పాటు చేసి మున్సిపల్ పారిశుధ్య సిబ్బందితోపాటు అగ్నిమాపక అధికారులు మంటలను అదుపులోకి తెచ్చారు. మంగళవారం ఉదయం కమిషనర్ దివాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, కౌన్సిలర్లు డిష్ గోవిందు, దేవరాజు, పెద్ద వన్నూరుస్వామి, వార్డు ఇన్‌చార్జ్ గోరంట్ల సత్యనారాయణ తదితరులు పరిశీలించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా క్షేత్రస్థాయి చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

నేడు 'ఆసరా వారోత్సవాలు'

కణేకల్లు: మండల కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు ' వైఎస్సార్ ఆసరా' వారోత్సవాలు నిర్వహించనున్నట్లు వైకేపీ ఏపీఎం గోవిందప్ప మంగళవారాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేడుకల నిర్వహణ కోసం బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. ఈకార్యక్రమానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. కార్యక్రమానికి మహిళ సంఘాల సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



రికార్డులు పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ

కంబదూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రంథాలయాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని ఆ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాలకు రూ.40 లక్షల విలువైన పుస్తకాలు, రూ.15 లక్షల విలువైన కంప్యూటర్లు అందజేశామన్నారు. అలాగే నార్పల, బ్రహ్మసముద్రం, కనగానపల్లి మండలాల్లో గ్రంథాలయాలకు పక్కా భవనాలను నిర్మిస్తున్నామన్నారు. వంద ఉద్యోగాలను భర్తీ చేశామని, ఔట్‌సోర్సింగ్ ద్వారా మిగిలిన ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామన్నారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, గ్రంథాలయాధికారి సత్యం బాబు పాల్గొన్నారు.

పొగాకురహిత సమాజం నిర్మిద్దాం

శెట్టూరు: ధూమపానం, పొగాకు రహిత సమాజం నిర్మిద్దామని మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ తరుణసాయి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ అధికారి అబ్దుల్ ఖాదర్ మలేరియా, డెంగీ జ్వరాలపై అవగాహన కల్పించారు. అనంతరం 35 మంది ఆశా వర్కర్లకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శోభలత, సూపర్‌వైజర్లు లీలావతి, సుమతి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

కళ్యాణదుర్గం: పట్టణంలోని అక్కమాంబ ఆలయ హుండీ కానుకలను మంగళవారం అధికారులు లెక్కించారు. ఎండోమెంట్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ ఈఓ దాసు పర్యవేక్షణలో అర్చకులు, గ్రామ పెద్దలు హుండీని లెక్కించారు. ఈ ఏడాది ఉగాది పర్వదినం, అక్కమాంబ ఆలయ జాతర సందర్భంగా ఆలయానికి రూ.2,03,134 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

నంది వాహనంపై సంగమేశ్వరుడు



కూడేరు: మండల కేంద్రంలో శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కమ్మ సంఘం ఆధ్వర్యంలో నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరుడిని ఊరేగించారు. కమ్మ కులస్తులు, గ్రామస్తులు వేడుకల్లో పాల్గొని పార్వతీ పరమేశ్వరులను పూలమాలతో విశేషంగా అలంకరణ చేయించి ప్రత్యేక పూజలు చేయించారు. ఉదయం ఆలయంలో జోడు లింగాలకు అర్చకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి
- ఘనంగా 'వైఎస్సార్ ఆసరా' వారోత్సవాలు



మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



సమావేశానికి హాజరైన మహిళలు

గుమ్మఘట్ట: మహిళల ఆర్థిక స్వావలంభనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ విజయలక్ష్మి అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా మూడో విడత వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విప్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో అత్యున్నత పదువులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. బడ్జెట్‌లో సింహభాగం మహిళల అభ్యున్నతికే ఖర్చుపెట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబును ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. టీడీపీని భూస్థాపితం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మహిళలను నిలువునా మోసం చేసిన చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మహిళల జీవితాలు మెరుగుపడ్డాయన్నారు. అనంతరం విప్ 'వైఎస్సార్ ఆసరా' లోగో ఆవిష్కరించి, 689 సంఘాలకు సంబంధించి 6,942 సభ్యులకు 3.02కోట్ల రూపాయల మెగా చెక్కు అందించారు. కార్యక్రమంలో వైకేపీ ఏరియా కోఆర్డినేటర్ గంగాధర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మంజునాథ, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ భోజరాజనాయక్, వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలశీన, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గౌని కాంతారెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, వైస్ ఎంపీపీలు రామకృష్ణారెడ్డి, జయమ్మ, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు వన్నప్ప, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'కాలవ' హయాంలోనే ఇసుక, మట్టి దోపిడీ

రాయదుర్గం: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు హయాంలోనే ఇసుక, మట్టి దోపిడీ రికార్డుస్థాయిలో జరిగిందని, ఈ అవినీతి మరకను కడుక్కోవాలనే ఉద్దేశ్యంతో ఆ నిందను దుష్ట చతుష్టయంతో కలసి వైఎస్సార్‌సీపీ నాయకులపై నెట్టే కుట్రలకు తెరలేపాడని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆరోపించారు. మంగళవారం గుమ్మఘట్టలో నిర్వహించిన ఆసరా సభలో విప్ మాట్లాడారు. 'కాలవ' లాగ సంపద కోసం తాను రాజకీయాల్లోకి రాలేదన్నారు. ఉద్యోగ ప్రస్థానం నుంచి సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టానన్నారు. రాజకీయాల్లోకి వచ్చాక కూడా దాన్నే అనుసరిస్తూ రాయదుర్గం చరిత్రలోనే ఇప్పటి దాక ఏ వ్యక్తి చేయని విధంగా 7 వేల మందికి ఉచిత వివాహాలు, 3 వేల మందికి కంటి ఆపరేషన్లు చేయించానన్నారు., విద్యార్థులకు ట్రైసైకిళ్లు, మంచినీటి ట్యాంకర్లు, ఉచితంగా అంబులెన్సులు, ఆస్పత్రిలో రోగులకు భోజన సౌకర్యం, మహిళలకు ఒడిబియ్యం, ఆలయాల అభివృద్ధికి నిధులు, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానన్నారు. ప్రజా సొమ్ము దోపిడీకి మాత్రమే కాలువ పెద్దపీట వేశాడన్నారు. ఈ నెల 13న బళ్లారి పోలీసులకు పట్టుబడ్డ టిప్పర్ డి హీరేహాళ్ మండలానికి చెందిన టీడీపీ నాయకుడిదేనని, దాంట్లో డ్రైవర్‌గా కూలీ పనికి వెళ్లిన వ్యక్తిని ఆధారంగా చేసుకుని వైఎస్సార్‌సీపీ కి ఎలా అంటగడతావని కాలవను నిలదీశారు. ఇలాంటి ద్రోహులకు రాజకీయ సమాధి కట్టాలన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, రాయదుర్గంలో కాలవ ఘోర ఓటమి చెందేలా నారీ శక్తి మొత్తం ఏకం కావాలన్నారు. కాగా టీడీపీ మద్దతుదారు, సర్పంచ్ విజయలక్ష్మి కూడా వైఎస్సార్‌సీపీ కండువాలా ఉండే టవాల్ ధరించి సభలో పాల్గొనడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు. మంచి చేసే ప్రభుత్వానికి పార్టీలకు అతీతంగా మద్దతు పలికే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అక్కడికొచ్చిన వారంతా మాట్లాడుకోవడం విశేషం.

మల్లేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఉరవకొండ: ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న దృశ్యం



రాయదుర్గంటౌన్: కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

ఉరవకొండ: పట్టణంలోని మల్లేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు హంపయ్య, ఉదయం సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, గంగపూజ, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, ధ్వజారోహణం, అంకురార్పణ, కలశ ప్రతిష్ఠ, అవాహిత దేవతాహోమాలు పూజలు నిర్వహించారు. పవిత్ర గంగజాలాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి సంప్రదాయ బద్ధంగా స్వామికి అభిషేకించారు. బుధవారం భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా జంబుకేశ్వరస్వామి కల్యాణోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో స్వయంభు జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి అర్చకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు కల్యాణోత్సవం చేపట్టారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టా. సాయంత్రం స్వామి ముత్యాల పల్లకి ఉత్సవం నిర్వహించారు. బుధవారం గజేంద్ర వాహనోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి తెలిపారు.

వితంతువుల స్వయం ఉపాధి కల్పనే లక్ష్యం



మాట్లాడుతున్న ఆర్డీఓ నిశాంత్ రెడ్డి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం డివిజన్‌లో నిరుపేద వితంతువులకు ఆర్థిక చేయూతనందించడానికి స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంగా త్వరలో రుణమేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఎల్‌డీఎం నాగరాజరెడ్డితో కలిసి డివిజన్‌లోని వైకేపీ, మెప్మా, ఇండస్ట్రియల్, బ్యాంకర్లతో ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. తాను పనిచేసిన ప్రాంతంలో మహిళలకు ఆర్థిక వెసలుబాటు కల్పించాలన్న ఉద్దేశ్యంతో కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. మహిళలు టైలరింగ్, అగరబత్తీల తయారీ, కూరగాయల అమ్మకం, కిరాణా దుకాణం, చిక్కీల తయారీ, గార్మెంట్స్ వంటి వాటిని ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తామన్నారు. పీఎంజీకేవై తదితర పథకాల ద్వారా మహిళలకు రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ రుణ సదుపాయం కల్పించి ఆర్థికంగా ఎదిగేలా భరోసా కల్పిస్తామన్నారు. ఇందుకు మండలానికి 10 మంది చొప్పున వితంతువులను ఎంపిక చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా మండలాల వైకేపీ ఏపీఎంలు, బ్యాంకర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లాపుర మహాలక్ష్మీ దేవికి పూజలు

బొమ్మనహాళ్: మండలంలోని హరేసముద్రం గ్రామంలో మారికాంబదేవి కొల్లాపుర మహాలక్ష్మి దేవి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు కుంభాలు, నైవేద్యాలను ఊరేగింపుతో వచ్చి అమ్మవారికి సమర్పించారు. అలాగే మండలంలోని ఉప్పరహాళ్ గ్రామంలో చౌడమ్మ దేవి జాతర వైభవంగా నిర్వహించారు.

అమ్మవారి ఆలయాల్లో..

బెళుగుప్ప: మండలంలోని గుండ్లపల్లిలో కొల్లాపురమ్మ, మారెమ్మ, కుంటి మారెమ్మ ఆలయాల్లో మంగళవారం జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ రేఖమ్మ, సర్పంచ్ పురుషోత్తం, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకట్‌రెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులు సోదరభావాన్ని పెంపొందిస్తాయి



ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గంటౌన్: పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని వినాయక సర్కిల్ వద్ద ఉన్న జువెలరీ స్ట్రీట్‌లో ముస్లిం వ్యాపారులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు విప్‌తోపాటు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సునార్ ఇస్మాయిల్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాంతారెడ్డి, షబ్బీర్, జువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎంజీ ఘని, వ్యాపారులు కేబీఎస్ ఇనాయత్, మొహమ్మద్ సైఫుల్లా, యూనస్, బాబులాల్, సొహైల్, అబ్బాస్, హారూన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు ఆర్థికసాయం అందజేత

గుమ్మఘట్ట: మండలంలోని మారెంపల్లి గ్రామానికి చెందిన రైతు గురుస్వామికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి రూ.61 వేల ఆర్థిక సాయం మంగళవారం అందించారు. గత నెల 13న రైతు పొలంలో మొక్కజొన్న పంటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. చేతికి వచ్చిన పంట కాలి బూడిదకావడంతో తీవ్రంగా నష్టపోయాడు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మండల మాజీ కన్వీనర్ కాంతారెడ్డి, కాంట్రాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణ, సర్పంచులు, నాయకులు కలసి అతడికి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఏడుగురు లబ్ధిదారులకు విప్ పొజీషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

రేపటి నుంచి చిక్కణ్ణేశ్వరస్వామి ఉత్సవాలు



చిక్కణ్ణేశ్వరస్వామి



సంగమేశ్వరస్వామి

కణేకల్లు: మండలంలోని చిక్కణ్ణేశ్వరస్వామి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. కణేకల్లు మండల ప్రజలు, మరీ ముఖ్యంగా కణేకల్లు ప్రజలు చిక్కణ్ణేశ్వరస్వామిని తమ ఇంటి ఆరాధ్యదైవంగా భావిస్తారు. ఏ శుభ కార్యక్రమం చేసినా ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ తర్వాత మిగిలిన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏటా నిర్వహించే ఉత్సవాలకు ఆంధ్ర, తెలంగాణతోపాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఏటా ఉగాది తర్వాత 15వ రోజు చైత్రశుద్ధ పౌర్ణమి రోజు స్వామి ఉత్సవాలను జరపటం ఆనవాయితీ. గురువారం స్వామి ఉత్సవం, 7న రథోత్సవం నిర్వహించనున్నారు. ఇది ఇలా ఉండగా చిక్కణ్ణేశ్వరస్వామి ఉత్సవాలు ముగిసిన మరుసటి రోజు నుంచి వారం రోజుల పాటు పంచాయతీ ఆధ్వర్యంలో ఎద్దుల పరుష నిర్వహించనున్నట్లు సర్పంచు నిర్మల, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. బస్టాండ్ ప్రాంతంలో చిక్కణ్ణేశ్వరస్వామి థియేటర్ పక్కనున్న ప్రదేశంలో పరుష నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

రేపటి నుంచి సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

బొమ్మనహాళ్: మండలంలోని శింగానహళ్లి సమీపంలోని వేదావతి నది ఒడ్డున వెలసిన సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 6న వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు సంగమేశ్వరస్వామి విగ్రహాలను శింగానహళ్లి నుంచి ఊరేగింపుగా సంగమేశ్వరాలయానికి చేరుకుంటారు. అదే రోజు ఉదయం 10 గంటలకు స్వామికి రుద్రాభిషేకం, ఆకుపూజ చేపడతారు. 12 గంటలకు సంగప్ప, సంగమ్మ కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటలకు శింగానహళ్లి నుంచి ఉత్సవ సామగ్రి ఊరేగింపుగా దేవస్థానం వద్దకు తీసుకు వెళ్తారు. 7వ తేదీ తెల్లవారుజామున ఐదు గంటలకు సంగమేశ్వరస్వామి ఉత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు రుద్రాభిషేకం, 12 గంటలకు మహామంగళహారతి, తీర్థ ప్రసాదాల వినియోగం ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు స్వామి రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై మొక్కలను తీర్చుకుంటారు. 8, 9 తేదీల్లో జాతర, 10న టెంకాయల వేలం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పెన్నహోబిలంలో వేలం రేపు

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన బియ్యం, బేడలను గురువారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని ఈఓ కె. విజయ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ. 10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

కూడేరు: మండలంలో జాబ్ కార్డులు కల్గిన వారు 12,452 మంది ఉన్నారని అందులో రోజుకు 6,230 మందికి ఉపాధి పని కల్పించాలని డ్వామా ఏపీడీ అనురాధ ఆదేశించారు. మంగళవారం ఆమె ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషాతో కలసి కూడేరులోని ఉపాధి కార్యాలయంలో పనుల కల్పనపై సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీ ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శెట్టూరు: ఉపాధి పథకం కింద ప్రతి వ్యక్తికీ పని కల్పించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గంగావతి, ఏపీఓ రమేష్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. పండ్లతోటల పెంపకానికి రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు.

రేషన్ సక్రమంగా అందజేయండి

వజ్రకరూరు: రేషన్ బియ్యం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కార్డుదారులు తహసీల్దార్ అనిల్‌కుమార్‌ను కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని బలిజ, బెస్త, రుసగడ్డ తదితర కాలనీలకు చెందిన సుమారు 200 మంది కార్డుదారులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని గోడు వెల్లబోస్నారు. ఇదే విషయాన్ని కార్డుదారులు డీఎస్ఓ శోభారాణి దృష్టికి కూడా తీసుకువెళ్లారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి

బ్రహ్మసముద్రం: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సచివాలయ భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటనాయుడు ఆధ్వర్యంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు భవనాల నిర్మాణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ బాలచంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్బరాయుడు, ఏఓ నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా వేరుశనగ దిగుబడి

కూడేరు: రబీ సీజన్‌లో బోర్ల కింద రైతులు సాగు చేసిన ట్యాగ్, కే6 వేరుశనగ పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని డిప్యూటీ గణాంకాధికారి తిర్మలాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని ఉదిరిపికొండలో రైతు ఉజ్జనమ్మ పొలంలో వేరుశనగ పంటకోత ప్రయోగాన్ని చేపట్టగా 13 కిలోల దిగుబడి వచ్చింది. అలాగే రైతు ఓబుళపతి పొలంలో 9 కిలోల దిగుబడి వచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల గణాంకాధికారి ఆశా, ఇన్సూరెన్స్ మండల కోఆర్డినేటర్ చంద్ర, వీఏఏ నారాయణమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

బ్రహ్మసముద్రం: వేపులపర్తి గ్రామంలో లక్ష్మీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో రాయదుర్గం మున్సిపల్ మాజీ చైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, ఎంపీటీసీ బూసప్ప, ఆలయ కమిటీ చైర్మన్ ఈశ్వర్, నాయకులు తిప్పారెడ్డి, మంజునాథ, శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

విలువలు పెంపొందించుకోవాలి

కుందుర్పి: గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు విలువలు పెంపొందించుకోవాలని ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు సూచించారు. మంగళవారం కుందుర్పిలో సంస్థ పర్యవేక్షణలో విద్యార్థుల సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం నుంచి గ్రామాల్లో 4–9వ తరగతి విద్యార్థులకు సంస్కార కేంద్రాల పేరుతో అన్ని గ్రామ పంచాయతీల్లో బడులు నిర్వహిస్తామన్నారు. కేంద్రాల నిర్వహణకు రూ.3వేల వేతనంతో శిక్షకులను నియమిస్తామన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

గుమ్మఘట్ట: మండలంలోని 75వీరాపురం గ్రామానికి చెందిన వెంకటరెడ్డి (53)బళ్లారి విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన వెంకటరెడ్డి పనినిమిత్తం రాయదుర్గం పట్టణానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. మార్గమధ్యంలో వాహనం అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు అతడిని బళ్లారికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సేవలు మెరుగుపడాలి

డి హీరేహాళ్(రాయదుర్గం): గ్రామ సచివాలయాల్లో ప్రజలకు అందించే సేవలను మరింత మెరుగయ్యేలా ఉద్యోగులంతా కృషి చేయాలని ఎంపీడీఓ భాస్కర్‌బాబు సూచించారు. డి హీరేహాళ్ మండలంలోని నాగలాపురం గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాలు ప్రజలకు మరింత భరోసా నిచ్చేలా పనిచేయాలన్నారు.

నేడు మంత్రి సమీక్ష

కళ్యాణదుర్గం: పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు ఓ ప్రకటన విడుదల చేశారు. సమీక్షకు నియోజకవర్గ వ్యాప్తంగా జెడ్పీటీసీలు, పార్టీ మండల కన్వీనర్లు, జేకేసీ మండల కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, స్టేట్ డైరెక్టర్లు, వివిధ విభాగాల చైర్మన్లు, ముఖ్యనాయకులు తప్పక హాజరు కావాలన్నారు.

సచివాలయ కన్వీనర్ల సమావేశం రేపు

విడపనకల్లు: ఉరవకొండ పట్టణంలోని లత్తవరం రోడ్డు వద్ద ఉన్న తొగటవీరక్షత్రియ కల్యాణ మండపంలో గురువారం మండలంలోని సచివాలయ కన్వీనర్లు, ముఖ్యనాయకుల సమావేశం జరుగుతుందని మండల సచివాలయ కన్వీనర్ భరత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి సచివాలయ కన్వీనర్లు, పార్టీ ముఖ్యనేతలు తప్పకుండా హాజరుకావాలన్నారు.

ఇంకుడు గుంత తవ్వించాలి

కూడేరు: వైఎస్సార్ గృహ నిర్మాణ పథకం ద్వారా జగనన్న కాలనీల్లో నిర్మించిన ప్రతి ఇంటి ముందు తప్పకుండా ఇంకుడు గుంత తవ్వించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ ఎంకే బాషా ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఇంకుడు గుంతల తవ్వకాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంకుడు గుంత ఏర్పాటుకు ప్రభుత్వం రూ.5 వేలకు పైగా మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫాతిమా , ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందేలా కృషి

ఉరవకొండ: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, దీర్ఘకాలిక రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా ఆశా కార్యకర్తలు కృషి చేయాలని రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పావని, వెంకటేష్ సూచించారు. మంగళవారం రాకెట్ల పీహెచ్‌సీలో ఆశాడే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సూపర్‌వైజర్లు శ్రీధర్‌మూర్తి, స్వర్ణలత పాల్గొన్నారు.

వడదెబ్బ ప్రాణాంతకం

బొమ్మనహాళ్: వడదెబ్బను నిర్లక్ష్యం చేస్తే ప్రాణపాయ పరిస్థితులు తలెత్తవచ్చని శ్రీధరఘట్ట డాక్టర్ గీతాభార్గవి హెచ్చరించారు. మంగళవారం కొలగానహళ్లి లో వడదెబ్బ, సీజనల్ వ్యాధుల నివారణపై విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త వెంకటరమణ, ఉపాధ్యాయులు శివరామిరెడ్డి, జ్యోతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కుందుర్పి: వేసవిలో ప్రజలకు వడదెబ్బ, అతిసార వ్యాధులు సోకకుండా వైద్య సిబ్బంది గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్యాధికారిణి అనూష సూచించారు. మంగళవారం ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కొల్లూరప్ప కుటుంబానికి అండగా ఉంటాం

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ కొల్లూరప్ప కుటుంబానికి అండగా ఉంటామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ భర్త శ్రీచరణ్ అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం కొల్లూరప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొమ్మన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూ

శెట్టూరు: మండలంలో అయ్యగార్లపల్లి, లక్ష్మంపల్లి, కనుకూరు, యాటకల్లు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఎంఈఓ శ్రీధర్, ఏఓ ఓబులేసు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో మొత్తం ఆరు వలంటీర్ పోస్టులు ఖాళీ ఉండగా ఎనిమిది మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారన్నారు. 6వ తేదీ వలంటీర్లను ఎంపిక చేస్తామని, ఈ నెల 10 నుంచి వారు విధులకు హాజరవుతారని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గంగావతి తెలిపారు.

వేలంలో పెరిగిన ఆదాయం

వజ్రకరూరు: మండల కేంద్రంలో జనార్దన వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, రామేశ్వరస్వామి, చొప్పరం ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి దేవాలయాలకు చెందిన భూముల కౌలుకు మంగళవారం వేలం నిర్వహించారు. 98.03 ఎకరాలకు గాను వేలం ద్వారా రూ.8,28,500 ఆదాయం వచ్చినట్లు ఈఓ అంగదాల క్రిష్ణయ్య తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.2,08,000 ఆదాయం అదనంగా వచ్చిందన్నారు. కార్యక్రమంలో తనిఖీ అధికారి రామతులసి, జూనియర్ అసిస్టెంట్ లాలేష్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.